క్లుప్తంగా

నిరాశ్రయులకు ఉచిత వైద్యశిబిరం



వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు గంగనపల్లె కూడలిలో ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడున్న వృద్ధులకు వైద్య సేవలు అందించారు. రామ్‌నగర్ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు చెందిన డా.మీనాక్షి తన సిబ్బందితో కలిసి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన వాళ్లకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిరాశ్రయుల కేంద్ర నిర్వాహకులు జోసెఫ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలమిత్రలకు దీపావళి కానుక



పాలమిత్రలకు మిక్సీలను పంపిణీ చేస్తున్న డెయిరీ ఉద్యోగులు

గుడిపాల: శ్రీజ మహిళా మిల్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాలమిత్రలకు మిక్సీలను పంపిణీ చేసినట్లు శ్రీజ డెయిరీ ఏరియా ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మసముద్రం పరిధిలో 24మంది పాలమిత్రలకు దీపావళి కానుకగా మిక్సీలు పంపిణీ చేశామన్నారు. స్వచ్ఛమైన, నాణ్యమైన పాలసేకరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి తెలియజేశారు. శ్రీజ పీబీఐ అధికారి నాగభూషణం యాదవ్ మాట్లాడుతూ జైకా సంస్థ సపోర్ట్‌తో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ గ్రామస్థాయిలో మహిళా పాల ఉత్పత్తిదారులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం మిక్సీలతో పాటు కిట్లు, క్యారీ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమేష్, నియాజ్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ బృంద సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులు తమ పొలాల్లో మామిడి, కొబ్బరి తోటల్లో నవధాన్యాలు విత్తుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, దిగుబడి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ టీమ్ లీడర్ చంద్రశేఖర్ అన్నారు. చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో మంగళవారం గ్రామసభలో రైతులకు నవధాన్యాలు కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూమి సారవంతమైన, ఎరువుల ఖర్చు తగ్గుతుందన్నారు. పశు వైద్యులు శివరాజన్ మాట్లాడుతూ నవధాన్యాల గ్రాసంతో పశువులకు అధిక పాల దిగుబడి, వేళకు చూడి కట్టడం, పశువులు ఆరోగ్యంగా ఉండడం జరుగుతుందన్నారు. జొన్న, అలసంద, పెసలు, ఉలవలు, సజ్జలు, మొక్కజొన్న వంటి మిశ్రమ దాణ వల్ల ఆర్థిక లాభాలు సైతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు డైరెక్టర్ వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. నవధాన్యాలు విత్తుకోవడం వల్ల భూసారం పెరుగుతుందని, ఉద్యాన పంటల్లో అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్లు, రైతులు పాల్గొన్నారు.

నిత్యం కోతలే..!



చిన్న చినుకులు రాలినా, గాలి వీచినా వెంటనే కరెంట్ కోతలు విధిస్తున్నారు. వర్షం సాకు చూపి కరెంటు కోతలు పెడుతున్నారు. ఈ ధాటికి పల్లెల్లో అంధకారంలో మునిగిపోయాయి. తరచూ ఇదే సమస్య తలెత్తుతోంది. రాత్రి పగలూ తేడా లేకుండా ఇదే సమస్య. జనం కరెంటు కోతలతో అల్లాడిపోతున్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం చూపడంలో విద్యుత్ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

- జీఎస్‌ఆర్‌పేట, తాళంబేడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ కరెంట్ కోతలు
- పగలూ, రాత్రి ఎడాపెడా కోతలు
- తరచూ విద్యుత్ సరఫరాలో ఇదే పరిస్థితి
- లోడు ఎక్కువ అయి ఫ్యూజ్‌లు ఎగిరిపోతున్నాయని కుంటిసాకులు
- సమస్య పరిష్కారంలో విద్యుత్ అధికారుల మీనమేషాలు
- అల్లాడిపోతున్న ప్రజలు



తాళంబేడు సబ్‌స్టేషన్

చిత్తూరురూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని బీఎస్‌ఆర్‌పేట, తాళంబేడు సబ్‌స్టేషన్ పరిధిలో 15 వేలకు పైగా కరెంటు మీటర్లు ఉన్నాయి. అయితే గత కొన్ని రోజులుగా పవర్ పడకేస్తోంది. నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. సాయంత్రం వేళల్లో వర్షం పడిందంటే చాలు ఆ రోజు రాత్రంతా కరెంటు కోతే. ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి. మరింత దారుణంగా ఉంటోంది. వర్షం సాకు చూపి కోతలు పెట్టిస్తున్నారు. ఉరుములు, మెరుపులు తలుక్కుమన్నా పవర్ కట్ చేస్తున్నారు. ఈ తరుణంలో విద్యుత్ శాఖ అధికారులు లోడు ఎక్కువై ఫ్యూజులు పోతున్నాయని వెల్లడిస్తున్నారు.

విలవిల..

అసలే వర్షాకాలం. ఎక్కడా చూసినా పాములు, విషపురుగుల సంచారం అధికమైంది. వీధులతో పాటు ఇళ్లల్లోకి సైతం వస్తున్నాయని భయపెడుతున్నాయి. చీకటి సమయంలో వీటిని గుర్తించక చాలామంది వాటి కాటుకు గురవుతున్నారు. ఇక ఎంతవర్షం పడిన పల్లె ప్రాంతాల్లో మాత్రం ఉక్కపోత మాత్రం వీడడం లేదు. ఈ నేపథ్యంలో రాత్రిపూట జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చంటి పిల్లలు ఉన్న కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. ఇదే మాదిరిగానే వ్యవసాయానికి కూడా విచ్చలవిడిగా కరెంటు కోతలు పెడుతున్నారు. ఇప్పుడు వర్షాలు సమృద్ధిగా కురవడం వల్ల కరెంటుతో పెద్దగా పని లేకపోయినా.. వర్షం లేని సమయంలో కూడా కరెంటు కోతలు ఉండడంతో రైతులు మండిపాటుకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కరెంటు కోతలు పెట్టించడం తగదని ఆవేశాన్ని వెల్లగక్కుతున్నారు.

కోతలపై సాకులు..

కరెంటు కోతలపై ప్రశ్నిస్తే విద్యుత్ శాఖ అధికారులు కుంటిసాకులు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. పిడుగు పడిందని, ఎక్కడో ట్రిప్ అయిందని, కరెంటు తీగలు తెగిందని..ఇలా పలురకాల కారణాలు చెబుతున్నారు. వర్షం లేని సమయంలో కరెంటు కోతలు పెడితే పలు కారణాలు చెబుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే అక్కడి సిబ్బంది ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కునుకు తీస్తున్నారని విరుచుకుపడుతున్నారు. ఒకవేళ నేరుగా వెళ్లి అడిగితే మాకేం సంబంధం లేదని బెదిరింపులకు దిగుతున్నారని చెబుతున్నారు. లేకుంటే పైఅధికారులు చెప్పినట్లు పాటించాల్సిందేనని సమాధానం ఇస్తున్నారు. అధికారులే విద్యుత్ ఆదా పేరుతో కరెంటు కోతలు తెప్పిస్తునారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కరెంటు ఉంటే ఒట్టు..



మా ఊళ్లో కరెంటు వాళ్లకు ఇష్టం వచ్చినట్లు కట్ చేస్తున్నారు. ఒక వారం రోజులుగా రాత్రి పూట కరెంట్ ఇవ్వడం లేదు. ఇదేమని అడిగితే ఎవరూ పట్టించుకునే వారు లేదు. సబ్ స్టేషన్‌కే కరెంటు రావడం లేదంటున్నారు. చానా ఇబ్బంది పడుతున్నాం. అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లం.. కరెంటు లేకుంటే ఇబ్బందే.

– నీలమ్మ, తాళంబేడు, చిత్తూరు మండలం

ఎన్నిసార్లు కట్ చేస్తారు..



ఒకరోజుకు 10 నుంచి 15 సార్లు పవర్ కట్ చేస్తారు. ఇదమేమని అడిగే ఏదేదో సాకులు చెబుతారు. గట్టిగా అడిగితే.. మాకు సంబంధం లేదంటున్నారు. వర్షం వస్తే ఏదో సమస్య వచ్చి ఉంటుందని అనుకోవచ్చు. వర్షం లేనప్పుడు కూడా ఈ కోతలు ఏంటో మాకు అర్థం కావడం లేదు. ఆ ఇచ్చే అరకొర కరెంటులో కూడా లోవోల్టేజీ వస్తోంది.

– రవిరెడ్డి, తాళంబేడు, చిత్తూరు మండలం

కట్ చేస్తూనే ఉంటారు..



వారం రోజులుగా కరెంటు లేకుండా చాలా ఇబ్బంది పడుతున్నాం. వాళ్లకు ఇష్టం వచ్చినట్లు కరెంట్ కట్ చేస్తున్నారు. పగలు కూడా ఎప్పుడు పడితే అప్పుడు కట్ చేస్తారు. రాత్రి అయితే కూడా ఇదే పరిస్థితి. చిన్న పిల్లలు ఉండేవాళ్ల ఇబ్బంది పడుతున్నారు. ఇలాగైతే ఎలా బతకాలి ? అడిగితే సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు.

– బాలాజీ, తాళంబేడు, చిత్తూరు మండలం

సమస్యలు లేకుండా చూస్తాం..

గత నాలుగు రోజులుగా అయితే వర్ష ప్రభావం వల్ల సమస్యలున్నాయి. వాటిని సరి చేసే పనిలోనే ఉన్నాం. వర్షం లేనప్పుడు సమస్యలు ఉంటే తప్పక చూస్తాం. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకుంటాం. కరెంటు కోతలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– మునిచంద్ర, విద్యుత్‌శాఖ ఈఈ, చిత్తూరు

వరసిద్ధుడి సేవలో కర్ణాటక మంత్రి



కర్ణాటక మంత్రికి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం కర్ణాటక రాష్ట్ర మంత్రి శరణబసప్ప దర్శనపూర్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయను ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన సేవలు చూశారు. అనంతరం ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు వేద ఆశీర్వచనాలతో పాటు స్వామి ప్రసాదం, చిత్రపటంఅందజేశారు.

ఈ-పంట నమోదు పరిశీలన



ఈ-పంట నమోదు చేయిస్తున్న ఏఓ సంగీత

గుడిపాల: ఈ–పంట నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. మంగళవారం ఏఎల్‌పురం, నారగల్లు పంచాయతీల్లో ఈ–పంట నమోదు ఎలా జరుగుతోంది ? అనే వాటిపై గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 50,220 సర్వే నంబర్లు ఉన్నాయని ప్రస్తుతం 17,296 సర్వే నంబర్లు మాత్రమే ఈ–క్రాప్ నమోదు చేశారన్నారు. ఈనెల 25వ తేదీ వరకు మాత్రమే చివరి తేదీ అని అంతలోపు అందరూ పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు ద్వారానే అన్నదాత సుఖీభవ, ఇన్సూరెన్స్ వంటి వాటితో పాటు అన్ని పథకాలు వర్తిస్తాయన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాదని నగర పాలక ఆరోగ్య అధికారి డా.లోకేష్ హెచ్చరించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు.. మంగళవారం సాయంత్రం నగరపాలక పరిధిలో పలు దుకాణాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ప్రజారోగ్య విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శుల బృందం నగరంలోని పొన్నియమ్మగుడి వీధి, చర్చివీధి, సుందరయ్యర్ వీధి, రాములగుడి వీధి, బజారు వీధి తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై నగరపాలక పరిధిలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయినా దుకాణాల్లో వినియోగిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం వీటిని ఉపయోగించ రాదన్నారు. మంగళవారం నాటి తనిఖీల్లో వివిధ దుకాణాల్లో నిల్వ ఉంచిన, వినియోగిస్తున్న సుమారు 200 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేసి, రూ.26 వేలు అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథ్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరికిషన్, అశోక్, శానిటేషన్ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



గుడిపాల: పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు సాయిసుధ, రవితేజ



గుడిపాల: పాడి పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్లు

గుడిపాల: పాడిరైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ తెలిపారు. మంగళవారం మండలంలోని అల్లాగుంట వద్ద పశువైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ పశువైద్య శిబిరంలో 210 పశువులకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, పశువుల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు పాడి రైతులకు పశువులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనంతరం కొన్ని పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

తవణంపల్లె: వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సరకల్లులో వైద్యసిబ్బంది రోగులను పరీక్షించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో తాగునీరుకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. జ్వరాలు సోకితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు



బంగారుపాళెం: పాలేరులో ప్రత్యేక మండపంలో కొలువుదీర్చిన అయ్యప్పస్వామి చిత్రపటాలు

బంగారుపాళెం: మండలంలోని పాలేరులో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి అంబళం పూజను అయ్యప్పభక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులు స్థానిక రామాలయం కల్యాణ మండపంలో అంబళం పూజలు గురుస్వామి కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. అరటి పట్టలతో ప్రత్యేక మండపం ఏర్పాటు చేసి అయ్యప్పస్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అయ్యప్పస్వామి అంబళం పూజా కార్యక్రమాలను నిర్వహించి భజనలు చేపట్టారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులతో బోయకొండ కిటకిట



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీతో క్యూలన్నీ కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అందంగా ముస్తాబుచేశారు. కోర్కెలు ఫలించిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించారు.

టీబీ ముక్తభారత్ సర్వేపై సమీక్ష



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్

తవణంపల్లె: మండలంలో టీబీ ముక్తభారత్ సర్వేను సకాలంలో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మండలంలోని ఎంఎల్‌హెచ్‌పీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీలు స్క్రీనింగ్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. వారం రోజుల్లో వందశాతం పూర్తిగా చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి రిపోర్టు పంపాలని ఆదేశించారు. టీబీ అనుమానితులను మరోసారి ఎక్స్‌రే పరీక్షలు చేయించి నిర్ధారించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు గోపి, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఎల్‌టీ శేఖర్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతలపై వర్క్‌షాప్



ప్రపంచ మానసిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న అధ్యాపకులు, విద్యార్థులు

తవణంపల్లె: అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అపోలో మెడికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్య రామకృష్ణ వర్క్‌షాప్ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత గురించి వివరించారు. మనిషి ఆరోగ్యవంతంగా జీవించడం అలవర్చుకోవాలన్నారు. మానసిక రోగులు మానసిక వైద్య నిపుణులచే పరీక్షలు చేయించుకుని మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. మానసిక ఆరోగ్య పరీక్షలు ఎలా చేయించుకోవాలనే పలు విషయాలపై సూచనలు, సలహాలిచ్చారు. అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనన్నారు.

కూలడానికి సిద్ధంగా చావడి



పాఠశాల పక్కనే శిథిలావస్థలో ఉన్న గ్రామ చావడి భవనం

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో నడిబొడ్డున ఆదర్శ పాఠశాలకు ముందర ఉన్న గ్రామ చావడి కూలడానికి సిద్ధంగా ఉంది. బ్రిటీష్ కాలంలో తవణంపల్లె నడిబొడ్డున చిత్తూరు–అరగొండ ప్రధాన రహదారి పక్కన ఈ చావడి నిర్మించారు. కానీ కొన్నేళ్లుగా గ్రామ చావడి భవనం శిథిలావస్థకు చేరింది. చావడి పక్కనే ఆనుకుని ఉన్న ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాలలో సుమారు 80 మంది వచ్చి చదువుకుంటున్నారు. గ్రామ చావడి గోడలు బాగా దెబ్బతిని వర్షాలకు తడిసి కూలుతోంది. గోడలు ఎప్పుడు కూలి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. స్థానికులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తహసీల్దార్‌కు, పోలీసులకు సమాచారం అందించి తగు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు భవనాన్ని తొలగించి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.

ఆక్రందన సభస్థలం మార్పు

కాణిపాకం: మామిడి మద్దతు ధర ప్రకారం రైతులకు నగదు చెల్లింపులు చేయాలని కోరుతూ రైతు సంఘ నేతలు చేపట్టిన ఆక్రందన సభ స్థలాన్ని మార్పు చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. బంగారుపాళ్యం మండలంలోని బ్రహ్మానంద ఆశ్రమంలో సభ జరుగుతుందన్నారు. తొలుత బంగారుపాళ్యం మార్కెట్ యార్డుగా ప్రకటించామని, అనివార్య కారణాల వల్ల సభ నిర్వహణను బ్రహ్మానంద ఆశ్రమానికి మార్పు చేశామన్నారు. రైతులు ఈవిషయాన్ని గమనించాలని వారు కోరారు.

మద్యం మత్తులోనే తప్పుడు ప్రచారం

- టీడీపీకి ఓటేస్తే నాశనమే అంటూ దినేష్ అనే యువకుడి వీడియో వైరల్
- మద్యం మత్తులో అలా మాట్లాడాడని వెల్లడించిన డీఎస్పీ సాయినాథ్
- ఆపై కొన్నిగంటలకే తనకు ప్రాణహాని లేదని చెప్పిన దినేష్



విలేకరుల సమావేశంలో డీఎస్పీ సాయినాథ్

పూతలపట్టు(యాదమరి): గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన టీడీపీ కార్యకర్త దినేష్ సెల్ఫీ వీడియోపై డీఎస్పీ సాయినాథ్ స్పందించారు. మంగళవారం ఆయన ఈ ఘటనపై పూతలపట్టు పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివారం సాయంత్రం రంగంపేట క్రాస్ రోడ్డులో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తుండగా పులిచెర్ల మండలం నుంచి మహేష్ అనే వ్యక్తి రెండు కార్లలో చిత్తూరు వైపుగా వచ్చాడన్నారు. అదే సమయంలో రామాపురం గ్రామానికి చెందిన దినేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో ముందు వెళ్తున్న కారును ఢీకొన్నాడని, ఆ సమయంలో అక్కడికి సాయం చేయడానికి వచ్చిన స్థానికులను కూడా దినేష్ మత్తులో దుర్భాషలాడాడని తెలిపారు. దీంతో పోలీసులు అతన్ని పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశారన్నారు. అయితే అతను తన కూతురు సహస్రను తీసుకుని రాత్రి పోలీసు స్టేషన్‌లో తప్పుడు వీడియో తీసి ప్రచారం చేశాడన్నారు. పోలీసుల విధులకు భంగం కలిగించడంతో అతనిపై మరో కేసు నమోదు చేశామని చెప్పారు. కాగా డీఎస్పీ విలేకరుల సమావేశం ముగిసిన కొన్ని గంటలలోనే ఈ ఘటనపై బాధిత వ్యక్తి పూతలపట్టు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తెలుగుదేశం నాయకుల నుంచి తమ కుటుంబానికి ఎటువంటి హానీ లేదని..తాను కేవలం మత్తులో ఉండడంతోనే వీడియో తీశానని చెప్పడం గమనార్హం.

వరి.. నేలవాలి



తవణంపల్లె: మండలంలోని గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలమట్టమైంది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 75 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. గత పది రోజులుగా తుపాను తాకిడికి ఎడ తెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు అధికం కావడంతో చేతికి వచ్చిన పంట నేలకొరిగింది. వరి పంట నేలమట్టం కావడంతో ధాన్యం మొలకెత్తి పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేరుశనగ, కంది పంటలు సైతం దెబ్బతింటున్నాయి. వేరుశనగ పంటను ఒడుపుకోవడానికి వరుణుడు తెరపివ్వకపోవడంతో భూమిలోనే మొలకెత్తుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట చేతికి అందక నష్టపోతున్నారు. ప్రకృతితో పాటు అడవిపందులు పంటలను నాశనం చేస్తున్నాయి.